


# పొగ

కొవ్వుటూరు వెంకట నారాయణరావు

పెద్ద పెద్ద కొండల **వడు**మ చిన్న చిన్న బండలు. ఆ బండల నడుమ చితికి **పో**యిన బ్రతుకుల బండారాన్ని బయట పెడుతున్నట్లుగా వున్న క్వారీ పనివాళ్ళ పూరిగుడిసెలు ఉదయ సంధ్యలో తమ చైతన్యం లేని అందాన్ని ప్రదర్శి స్తున్నాయి. ఆ గుడిసెల్లో వుండే మనషుల్లాగే

అక్కడక్కడా బండలు పగులగొట్టబడి చర్మం వొలిచిన కళేబరాల్లా పడివున్నాయి

పనివాళ్ళు సుత్తులను గొడ్డళ్ళను చేత పట్టుకొని మెల్లగా గుడిసెల నుంచి బయటపడుతున్నారు, ఆ బండల్లో మిగిలి వున్న రక్త మాంసాలను పూర్తిగా పిండి ఆరబొయ్యను

క్వారీపనివాళ్ళ పెద్ద మేస్త్రీ రంగయ్య ఓ కాకీ చెడ్డీ మాత్రం ధరించి దాదాపు ముప్పయ్ అడుగుల ఎత్తు బండ మీద నిలబడి కూలీలు పనికి వెళ్ళడాన్ని పర్యవేక్షిస్తూ "రండి రండి బాగా పొద్దుబోయింది" అని అరుస్తున్నాడు

ప్రతి పూరిగుడిసె ముందు ఓ మూడు రాళ్ళపొయ్యి, మండుతున్న చిదుగులు, వెలుగుతున్న మంట, ఉడుకుతున్న సంకటి. పొగ తీగలుసాగి ఆకాశానికి లేస్తూంది ఆ కష్టజీవుల జీవస్పందనానికి గుర్తుగా గగనానికి తోరణాలు కడుతూ.

రంగయ్య అరఫర్లాంగు దూరంలో వున్న తన గుడిసెవైపు చూశాడు.

ప్రతిరోజూ ఉదయాన్నే అగుపించే పొయ్యిమంట పొగ ఆ రోజు అగుపించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. "ఏందశె సింగమ్మ నిద్రపోతావుంది గనకనా!" అనుకుంటూ బండ దిగి మెల్లగా గుడిసె చేరుకున్నాడు. పుట్టుక తోనే పొట్టిగా పుట్టిన ఎడమచేతిని నవ్వు కలిగేలా వూచుకుంటూ.

గుడిసెముందు పొయ్యిరాళ్ళ నడుమ బూడిదలో ఓ చిన్న కుక్కపిల్ల ముడుక్కుని వెచ్చగా నిద్రపోతూంది.

"సింగా" అంటూ గుడిసెను సమీపించి తడికె ముందుకు లాగి వుండడంతో "యాడికెళ్ళిందబ్బా బుద్దోణ్ణెత్తుకుని!" అనుకుంటూ వెళ్ళి కుండలోవున్న నీళ్ళను పగిలిపోయిన ప్లాస్టిక్ చెంబుతో తీసుకుని ముఖం కడుక్కుంటూ అడుగుల చప్పుడుతోపాటు మెట్టెలు టకటక వినిపించేసరికి అటువైపుచూచి "యాడ కెళ్ళావే సింగా!" అని అడిగాడు

మాసిపోయిన చీర కట్టుకుని ఓ నల్ల రాయిలా నిలబడ్డ సింగమ్మ భుజాన రెండేళ్ళ పసివాడు పాలరాయిలా పడుకుని వున్నాడు "యీడికి వల్లమాలిన జరం మంతరం యేయించి తీసుకొస్తా వుండా" అంది

"అగ్రారానికెళ్ళావా!" అని అడిగాడు రంగయ్య

"ఆఁ"

"మంతరాలకు సింతకాయలు రాల్తా యంటే నీ పిచ్చి గాకపోతే"

"మరేంచెయ్యను మావా?"

"సూదేయించాల కాశాస్త్రి తీసకెళ్ళి"

"దబ్బో"

"శాస్త్రిల్లు గోర్నె రానీ అడగుతా" అని పసివాడి వీపు తాకిచూచి "అబ్బా పెనం గాలినట్లు కాలిపోతావుండాది గదే"

"అవును మావాఁ నిన్నటాల్నుంచీ.. నువ్వెళ్ళిన కాణ్ణుంచీ"

"ఏం జెయ్యనే శాస్త్రిల్లుగోరు తోడు రారా అంటే తిరపతెళ్ళా నీతో గూడా చెప్పకుండా అయన మీ కూలోళ్ళకు సినిమా తెస్తా నువెళ్ళి నాకోసం ఎదురుచూస్తా వుండ్రా అంటే తిరిగొచ్చేసినా నిజంగా దేవుడంటే ఆయనేనే ఆయన మేనేజరైం

తర్వాతనే గదా మనకూలోళ్ళవంతా హాయిగా సంకటైనా తినగలుగుతా వుండాం" అన్నాడు రంగయ్య

"అవును మావాఁ యేమైనా యీ బుడ్డోణ్ణి నువ్వు " అని నసిగింది సింగమ్మ

రంగయ్య నవ్వి "దేవుడు నీకు అన్నాయం సేసిండే వాస్తా" అని ముందుకు సాగాడు

సింగమ్మ "మావాఁ" అంటూ భోరుమంది "నా కెరుకలేని తప్పుకు నన్ను శిక్షిస్తావా? ఓడెవడో తెలిస్తే యీ బుడ్డోణ్ణి ఓడికాడొదిలేస్తా కన్నాను గాబట్టి పెంచతావుండా"

పదడుగులు వేసిన రంగయ్య ఆ మాటలు విని ఆగి తిరిగి చూచాడు "యిదే యిది తప్పించగలవాఁ. అనుబయించాల అంతే" అని మరీ ముందుకు సాగాడు.

సింగమ్మ కొడుకుతో అలాగే కూలబడిపోయింది.

క్వారీ నడుమగా వెళ్ళే రోడ్డుపక్కనే చిన్న పెంకుటిల్లుంది

రంగయ్య దానిని చేరుకొని అరుగు మీద చతికిలబడ్డాడు

చుట్టుపక్కలనుంచి సుత్తిదెబ్బలు రాళ్ళను ముద్దుపెట్టుకుంటున్న శబ్దాలుగా వినవస్తున్నాయి. గతం మెదిలింది.

"మావోఁ అమ్మా నేనూ తిరనాళ్ళ కెళ్ళాల. తోల్డావూ?"— సింగమ్మ అడిగింది.

"నాకేడదే తీరిక నేను కారీ కెళ్ళాల. మా మేనేజరు శాస్త్రిలు శానా మంచోడు ఆయన్ను యిబ్బంది పెట్టడం నా కిష్టంలా" అన్నాడు తను.

"అయితే నేనూ అమ్మా యెళ్తాం"

"యెళ్ళండి "

మూడేళ్ళకిందటి సంఘటన రంగయ్య కళ్ళముందు మెదిలింది

"నిజం చెప్పవే సింగా "

సింగమ్మను మెల్లిగానే అడిగాడు తను.

"రేపేనే మన పెళ్ళి "

"చెప్తే నన్ను పెళ్ళి చేసుకోవు చంపేస్తావు మావాఁ"

"అది నా చాతైతే యెప్పుడో నిన్ను చంపేసుండేవాణ్ణే కడుపుతో వున్న నిన్ను ఎవ్వరూ పెళ్ళాడ్రే నేనే పెళ్ళాడాల నువ్వు అత్త కూతురివే చెప్పు నిజం చెప్పు అమ్మతో చెప్పన్లే నేనే కడుపు చేశానంటా."

"మావాఁ"

"ఎడవమాక. అసలేం జరిగిందో చెప్పెయ్ "

"నన్ను చంపేత్తావు మావాఁ"

"లేదు. పెళ్ళి చేసుకొని కాపరం చేస్తా. చెప్పకపోతే యాడకన్నా యెళ్ళిపోతా."

సింగమ్మ ఏదీదాచికోకుండా చెప్పింది.

" తిరునాళ్ళనుంచి తిరిగొస్తా వుండాం అమ్మా నేను జోరున వానొచ్చింది. మండపంలో చేరినం ఆ చీకట్లో

ఎవరో నా నోరు నొక్కి.... నన్ను నన్ను సెడిసిండు."....

రంగయ్య దీర్ఘంగా నిట్టూర్చాడు.

అయితే పుట్టిన బిడ్డ బంగారు ముద్ద లాగా పుట్టాడు.

తండ్రి ఎవరోగానీ!

ఆ బిడ్డను కన్నబిడ్డలా చూడలేక పోయినా ద్వేషించడంలేదు. దానికి తనను తాను మెచ్చుకుంటున్నాడు. రాగ ద్వేషాలలో అనురాగాన్నే తను ఎక్కువగా పంచిపెట్టగలుగుతున్నాడు. అయితే సింగమ్మ మాత్రం తనను నమ్మడంలేదు.

తన బిడ్డగాని బిడ్డను ఏ మగవాడైనా ఎంతమాత్రం చూడగలడు? అయినా తను అతీతంగానే మెలుగుతున్నాడు. సింగమ్మ కన్నతల్లి. కడుపుతీపి మనిషిని కట్టిపడ వేస్తుంది.

కారు శబ్దం విని అటువైపు తిరిగి చూచాడు.

దగ్గరపడేకొద్దీ ముందు కూచునివున్న శాస్త్రిలు అగుపించాడు.

ఉత్సాహంగా లేచాడు రంగయ్య.

కారు అతనిముందే ఆగింది. వెనుక సీట్లో ఏదో పెద్ద పెట్టెను పట్టుకుని ఇద్దరు కూచునివున్నారు. కారుపైన పొడుగాటి కమ్ములు, ఇంకా ఏదో ఇనుప సామాను కట్టివుంది.

శాస్త్రిలు కారు దిగుతూనే పిలకను ముడించుకుని "రంగయ్యా" అని అతని వైపుచూచి "అరె అదోలా వున్నావేం రంగయ్యా ఒంట్లో బాగాలేదా?" అని అడిగాడు.

"అదేంలేదయ్యగోరు... సినిమా తెచ్చిన్రా?" అని అడిగాడు.

"ఇదుగో లోపల"

"ఏదయ్యగోరూ?"— ఆశ్చర్యంగా చూచాడు రంగయ్య.

"అదే. ఆ పెట్టే. రంగయ్యా.... దాన్నే టెలివిషన్ అంటారు. అంటే సినిమా చూపే పెట్టె.... ఇవ్వాళ రాత్రికి మీ కూలివాళ్ళందరికీ చూపుతుంది.... చూచిన తర్వాత నీకే అర్థమౌతుందిలే." అన్నాడు పంచను ఎగదీసి కట్టుకుంటూ శాస్త్రిలు ఉదయ సూర్యుని కాంతిలో పాలరాతి విగ్రహంలా మెరిసిపోతూ.

ఓ గంటలో శాస్త్రిలుతోపాటు వచ్చినవాళ్ళు ఏంటెన్నాను కట్టి "సాయంత్రం వచ్చి టెస్ట్ చేస్తాం.... మీరు ఆపరేట్ చెయ్యండి. మేం వచ్చేదాకా ఆగక్కర్లేదు" అని వెళ్ళి పోయారు.

శాస్త్రిలు టెలివిషన్ సెట్ వైపు ఆనందంగా చూచి "రంగయ్యా మీ కూలీలకష్టంతో నేను బ్రతుకుతున్నాను... ఒంటరిగాణ్ణి నాకేం గావాలి మీ ఆనందం తప్ప" అన్నాడు.

"అట్లాగనకపోతే మీకేం అయ్యగోరూ దొరబిడ్డలాగుండారు. పెళ్ళిచేసుకోగూడదా?" అన్నాడు రంగయ్య.




శాస్త్రులు నవ్వి "నేను పాపిని రంగయ్యా నా సంగతి నీకు తెలియదులే" అన్నాడు.

"అయితే దేవుడుగూడా పాపే నయ్యాగోరూ," అన్నాడు రంగయ్య.

"కావచ్చు. లేకపోతే పాపులను పుట్టించడం దేవుడికెలా తెలుస్తుంది? .. రా టిఫిన్ చేద్దాం వచ్చేప్పుడు కాళహస్తినుంచి దండిగా ఇడ్లీలు, వడలు, దోసెలు పట్టుకొచ్చాను."

"మీరు కానియ్యండయ్యాగోరూ" అన్నాడు రంగయ్య.

"అదేంటి రంగయ్యా నేనూ మీ లాంటి మనిషినిగానా? ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావేంటి? టిఫిన్ చేసి వెళ్ళి బుద్ధోణ్ణి చూడాలి" అన్నాడు శాస్త్రులు.

రంగయ్యతో కూచుని ఫలహారం చేస్తూ "నిజంగా నువ్వు అదృష్టవంతుడివి రంగయ్యా బంగారంలాంటి కొడుకును కన్నావ్" అన్నాడు.

"పెళ్ళి చేసుకుంటే మీరూ అట్లాంటి బిడ్డనే కంటారయ్యాగోరూ." అన్నాడు రంగయ్య కాసేపాగి శాస్త్రులు ముఖంలోకి చూచాడు పరిశీలనగా. "నేనూ సింగమ్మా నల్లరాళ్ళలాంటివోళ్ళం అయ్యాగారూ. మాకు పాలరాతిలాంటి బిడ్డ పుట్టాడంటే ఏవంనాలి?"

"ఓరి పిచ్చి రంగయ్యా దేవుడనుకుంటే జరగనిదేముంది?"

"అవునయ్యాగోరూ దేవుడనుకుంటేనే జరిగింది అట్లా జరిగింది" అని గొణిగాడు, రం

"ఏమిటి రంగయ్యా "

"ఏంలేదయ్యగోరూ. సింగమ్మ కొడుకును గురించి ఆలోసిత్తావుండా"

"భలేవాడివే బుడ్డోడు నీ కొడుకు గాదేంటి కానీ ఫలహారం. వాణ్ణి చూచి వాడితో కాసేపు ఆడుకోందీ నాకు తృప్తుండదు కానీ కానీ" అన్నాడు శాస్త్రిలు.

తీరిగ్గా రంగయ్య గుడిసెను చేరుకున్న శాస్త్రిలు అతని బిడ్డకు జ్వరంగా వుందని తెలుసుకుని చీవాట్లుపెట్టాడు "నాతో చెప్తే ఇందాక కార్లోనే నిన్ను పంపేవాణ్ణిగదా రంగయ్యా బుడ్డోడితో డాక్టరు దగ్గరికి పీణ్ణి ఇలా వుంచడం మంచిదిగాదు. రెండు మైళ్ళేగా నడిచి వెళ్ళండి. ఇప్పుడు మీకు బస్సేమీలేదు అడ్డంగా వెళ్తే ఒకటిన్నర మైలే కాళా స్తి" అన్నాడు.

"నా దగ్గర డబ్బు లేదయ్యగోరూ" అన్నాడు రంగయ్య.

చివాలున లేచింది రంగయ్య మీదికి సింగమ్మ. "అదేంగాదులే మావాఁ. యీణ్ణి బతికించటం నీ కిట్టంలేదు "

"సింగా" కోపంగా అన్నాడు

"మి కోప తాపాలు తర్వాతగానీ ముందు బయలుదేరండి ఈ పది రూపాయలు తీసుకుని బాబుకు సూది వేయించి తీసుకురా రంగయ్యా" అని బనీను జేబులోంచి పదిరూపాయలు లాగి రంగయ్య చేత వుంచాడు శాస్త్రిలు. అయినా రంగయ్య కదల్లేదు. అది చూచి "యీడు సనిపోవడవేఁ మంచిది సాఁవేఁ" అంది ఏడుస్తూ రంగమ్మ.

"సింగమ్మా ఏవిఁటామాటలు? అందరికీ ఇటువంటి బంగారుబాబు పుడతాడా మీకంత కష్టంగా వుంటే బాబునిలా ఇవ్వండి నేను వెళ్ళి డాక్టరుకు చూపించి తీసుకువస్తాను" అన్నాడు శాస్త్రిలు

"మికంత పనెందుకు లెండయ్ గోరూ నేనూ సింగమ్మా యెల్తాం పదే" అన్నాడు రంగయ్య

సింగమ్మ తన కొడుకును భుజం మీదికి తీసుకుంది "బుడ్డోడా ఎందుకు పుట్టి నావురా" అంటూ, ఏడుస్తూ—

కాస్త చలించిన రంగయ్య "ఏకవ మాకే పద" అన్నాడు

వాళ్ళ పరిస్థితి శాస్త్రిలుకు ఏమీ అర్థంగాలేదు. మూసిన కన్ను తెరవ కుండా పడివున్న రంగయ్యబిడ్డ తల నిమిరి "భగవంతుని దయవలన బాబు తప్పకుండా కోలుకుంటాడు సింగమ్మా. వెళ్ళిరండి" అన్నాడు.

ముందు సింగమ్మా, వెనుకగా రంగయ్యా బయలుదేరి వెళ్ళారు

శాస్త్రిలు కాసేపు అక్కడే నిలబడి "ఏవిఁటో ఈ జీవితం" అనుకుంటూ మెల్లగా క్వారీ నాలుగు మూలలు తిరిగి ఓ అరగంట తర్వాత పెద్దబండ మీదికి ఎక్కి నాలుగువైపులా చూడసాగాడు

బండల నడుమ గుడిసెలు ఏ చైతన్యం లేకుండా నాగరికత సవతి బిడ్డల్లా పడివున్నాయి.

ప్రతి గుడిసె ముందూ వున్న మూడు రాళ్ళపొయ్యిలు తమ పని అయిపోవ డంతో నిద్రపోతున్నాయి.

వేసవి సూర్యుడు తొమ్మిదిగంటలకే తన ప్రతిభను దిక్కులేని బండలమీద చూపుతున్నాడు. బండలకైనా చలనం వుందేమోగానీ ఏ మార్పూలేని కార్మి కూలీల గురించి ఆలోచిస్తూ కాసేపు గడిపి రోడ్డుమీద లారీ రావడం చూచి చకచక బండను దిగి రోడ్డుమీదికి వెళ్ళి చెయ్యెత్తాడు.

లారీ శాస్త్రిలు దగ్గర ఆగింది. డ్రైవరు "కాళాస్త్రొస్తారా పంతులూ?" అన్నాడు.

"నీ దయ" అన్నాడు శాస్త్రిలు.

"మీ దయతో వందలకొద్ది కూలీలు ము ప్పూ ట లా తినగలుగుతున్నారు పంతులుగారూ.... దేవుడంటే ఎవరో గాదు. ఎక్కండి మీరే!" అన్నాడు.... డ్రైవరు.

"రంగయ్య బిడ్డకు బాగాలేదని తీసు కెళ్ళున్నాడు.... ఆ పసివాడంటే నాకు పంచప్రాణాలు" అన్నాడు శాస్త్రిలు.

"ఎక్కండి. మీకు కష్టజీవులంటేనే పంచప్రాణాలు" అన్నాడు డ్రైవరు.

"ఏదోలే డ్రైవరూ నా కాలం ఇట్లా గడిచిపోనీ. ఒంటరిగాణ్ణి.... నాకేం పెళ్ళాం బిడ్డలా?" అని లారీ ఎక్కాడు శాస్త్రిలు.

"నాకు పెళ్ళయ్యింది డ్రైవరూ"— నవ్వుతూ అన్నాడు శాస్త్రిలు.

"అయ్యిందా.... పోండి పంతులూ" డ్రైవరు నమ్మలేకపోయాడు.

"పెళ్ళంటే ఏవిఁటి?.... నా దృష్టిలో అదంత ప్రాధాన్యతగలిగిన విషయంగాదు. ఒక స్త్రీ ఒక పురుషుడు శారీరికంగా కలు స్తున్నారని చాటిచెప్పడవేఁ గదా... దానికి గొప్పతనం అంటగట్టాలా?.... నేనూ ఒక స్త్రీతో....ఒకే ఒక స్త్రీతో సంబంధం కలిగివున్నాను.... ఒ క్క సా రే.... అయితే ఆ స్త్రీముఖం నాకు తెలియదు... నా ముఖం ఆ స్త్రీకి తెలియదు. అంతా చీకట్లో జరిగిపోయింది.... నేను జీవితం మీద విరక్తి పెంచుకున్నాను. ఇలా బ్రతుకుతున్నాను డ్రైవరూ" అన్నాడు శాస్త్రిలు.

"ఒక మగాడికి ఎంతోమంది ఆడాళ్ళు ఒక ఆడదానికి ఎంతోమంది మగాళ్ళూ జత కుదురుతూంటారు. అదంతా పెంప ర్వారీ ఆనందం.... నా మాట విని పెళ్ళి చేసుకోండి పంతులూ" అన్నాడు డ్రైవరు.

శాస్త్రిలు నవ్వాదేగానీ సమాధానం చెప్పలేదు.

కాళహస్తి చేరుకున్నతర్వాత డాక్టరు దగ్గరికి వెళ్ళి "మా రంగయ్య వచ్చాడా డాక్టరుగారూ" అని అడిగాడు శాస్త్రిలు.

"రంగయ్య అంటే కొట్టిచెయ్యతను గదూ?" అన్నాడు డాక్టరు.

"అఁ. భార్యతోగూడా వచ్చాడు బిడ్డను తీసుకొని. బిడ్డకు బాగాలేదు."

"రాలేదే."

శాస్త్రిలుకేమీ పాలుపోలేదు.

వెంటనే బస్సులో మరికొంచరి క్వారీ కూలీలతో తిరిగి వస్తూ క్వారీ దగ్గర పడుతూంటే ఓ పెద్దబండ వెనుక పొగ రేగడం చూచి "అక్కడెవరన్నా మన కూలీలు గుడిసెలు వేసుకున్నారా?" అని అడిగాడు శాస్త్రిలు.

''లేదయ్‌గోరూ'' అన్నాడా కూలీ.

బస్సు దిగుతూనే ఓ కూలీని పిలిచి ''రంగయ్య తిరిగివచ్చాడేమో చూడు'' అని పంపాడు

అతను అయిదునిముషాల్లో తిరిగివచ్చి 'గుడిసెకాడుండాడయ్‌గోరూ' అన్నాడు.

శాస్త్రిలుకేమీ అర్థంగాలేదు వెంటనే గుడిసెదగ్గరికి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళాడు

రంగయ్య తలవంచుకుని ఒకపక్క కూచునివున్నాడు.

సింగమ్మ శాస్త్రిలును చూస్తూనే ''అయ్యగోరూ'' అంటూ భోరుమంది.

''సింగమ్మా ఏవిటి మీరు డాక్టరుదగ్గరికి వెళ్ళలేదా?''

''బుడ్డోడు పోయిండై గోరో'' — మరీ పెద్దగా ఏడ్చింది సింగమ్మ

నిర్ఘాంతపోయిన శాస్త్రిలు ''బాబూ'' అంటూ ఏడవసాగాడు.

రంగయ్య మెల్లగాలేచి ''మీరెందుకండయ్యగోరూ ఏడుస్తారు. బుడ్డోడు నా కొడుకు నేనేడవడంలేదు. అది తల్లి గాబట్టి ఓణ్ణి కన్నదిగాబట్టి ఏడుస్తావుంది'' అన్నాడు

''నీ కొడుకును నా కొడుకు గాదంటా వేంటి రంగయ్యా''— బాధపడుతూనే అడిగాడు శాస్త్రిలు.

అవునయ్యగోరూ వాడు చనిపోవడమే మంచిదైంది. ఎవరో బాగా చీకటిపడ్డతర్వాత తిరునాళ్ళనుంచి తిరిగొస్తావుండిన సింగమ్మను మండపంలో చెరిసిండు ఆ పాపమేనయ్‌గోరూ బుడ్డోడు కడుపుతో వుంటే సింగమ్మను ఎవ్వరూ పెళ్ళిచేసుకోరని నేనే చేసుకున్నా అది నా మేనత్తకూతురయ్యగోరూ'' అన్నాడు రంగయ్య. ''మా మేలుగోరే మీకు ఈ రగస్యం దాచాం. క్షమించండి

శాస్త్రిలు తల ఒక్కసారి తిరిగినట్లయిపోయింది. ఆ పాపి ఎవరోగాదు? తనే!

శాస్త్రిలు గుండెలు పిండినట్లు కన్నీరుగారాయి. ''బుడ్డోణ్ణేంచేశారు రంగయ్యా?'' గద్గదికంగా అడిగాడు

''సగం దూరం యెల్లేసరికి సింగమ్మ రాయితట్టుకుని పడ్డది. బుడ్డోడి తలకు మంచి దెబ్బ తగిలింది కెవ్వుమంటా ప్రాణాలొదిలిండు అణ్ణే ఓణ్ణి తగులబెట్టి ఇప్పుడే వచ్చినాం అట్టాసూడండి... ఆ పొగ అదే'' అన్నాడు ఏమాత్రం తొణుకూ బెణుకూ లేకుండా రంగయ్య.

శాస్త్రిలు అటువైపు చూచాడు.

దూరంగా అగుపిస్తున్న కాళహస్తీశ్వర ఆలయ గోపురంలా దట్టమైన పొగ ఆకాశంలోకి లేస్తూంది

శాస్త్రిలు మౌనంగా ''బుడ్డోడా'' అనుకుంటూ అటువైపు నడిచాడు.